

## విద్యుత్‌శాఖలో కంట్రోల్ రూమ్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 17 : విద్యుత్ శాఖ సంగారెడ్డి సర్కిల్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ మాధవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌ఇంజనీర్ ఆధ్వర్యంలో ఒకటి, ఆర్టిజన్ నిర్వహణలో మరొకటి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. వినియోగదారులు ఫిర్యాదులకు 9440813707, 9398884361 ఫోన్ నంబర్లకు కాల్ చేయాలని ఆయన సూచించారు. అలాగే ఎస్ఎంఎస్, వాట్సాప్ సందేశాలను ఇవ్వదలచిన వారు పూర్తి వివరాలను పేర్కొనాలని మాధవరెడ్డి పేర్కొన్నారు.

## మున్సిపాలిటీల్లో పన్నులు... వందశాతం వసూలు చేయాలి

- పార్కుల నిర్వహణ, పారిశుధ్యం బాగుండాలి
- కమిషనర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి
- అక్రమ నిర్మాణాలు, కబ్జాలను అరికట్టాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 17 : జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్సు పన్నులు, నీటి కులాయి బిల్లులను వందశాతం వసూలు చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. బిల్ కలెక్టర్‌ల వారీగా అన్ని పన్ను లక్ష్యాలను నిర్ణయించి రోజువారి వసూళ్ల వివరాల నివేదికను అందించాలని, మొండి బకాయిలు ఉన్న దగ్గర మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. పనితీరు బాగలేని బిల్‌కలెక్టర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపాలిటీల్లో కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. మున్సిపాలిటీల్లో ఫుట్‌పాత్ జంక్షన్‌లలో ఎక్కడా ఫ్లెక్సీలు, హోర్డింగులకు అనుమతించవద్దని సూచించారు. ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పట్టణ ప్రజలకు ఆహ్లాదకర, స్వచ్ఛమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీల్లో అన్ని పార్కులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని, పార్కుల నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి 6.30 వరకు పారిశుధ్య నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని, రెగ్యులర్‌గా అన్ని వార్డులు సందర్శించి ప్రజలతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ ఈఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు, కబ్జాలు జరగకుండా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి కమిషనర్లకు సూచించారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని నిర్మాణాలు ఉంటే ప్రారంభ దశలోనే గుర్తించి వాటిని కూల్చివేయాలని ఆదేశించారు. వీధి వ్యాపారు కోసం అవసరమున్న ప్రదేశంలో స్ట్రీట్ వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ బాగుండాలని, పారిశుధ్య నిర్వహణ సజావుగా జరిగేలా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. మున్సిపాలిటీల్లోని ప్రాధాన్యత పనులను వెంటనే ప్రారంభించాలని కమిషనర్లను ఆమె ఆదేశించారు.


మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి


పెద్దశంకరంపేటలోని రైస్‌మిల్లులో సీఎంఆర్ బియ్యం లోడ్

## గడువులోగా సీఎంఆర్ ఇస్తారా..లేదా?

- మిల్లర్లకు నెలాఖరు వరకే ఛాన్స్
- నిర్ణీత వ్యవధిలో అప్పగించడం కష్టమే!
- యాసంగి సీజన్ సీఎంఆర్‌కు కొంత వెసులుబాటు

మెదక్, జనవరి 17 : నెలాఖరులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం నిర్దేశించగా ఈసారి నిర్ణీత వ్యవధిలో సేకరించడం ప్రశ్నార్థకంగానే మారింది. మిల్లర్లు సకాలంలో సీఎంఆర్‌ను ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు(ఎఫ్‌సీఐ) అందించేందుకు అధికారులు చేపడుతున్న చర్యలు, చేస్తున్న హెచ్చరికలు సత్ఫలితాల్ని ఇవ్వడం లేదు. ఎన్నిసార్లు హెచ్చరికలు చేస్తున్నా మిల్లర్లు జాప్యం చేస్తూనే ఉన్నారు. రికవరీ శాతం ఏమాత్రం పెరగడం లేదు. సంవత్సర కాలంగా కస్టమ్ మిల్లింగ్‌కు రైస్‌మిల్లర్లు గడువు పెంపును కోరుతూనే ఉన్నారు.

### 6.86 లక్షల మెట్రిక్‌టన్నుల ప్రొక్యూర్‌మెంట్

మెదక్ జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 2022-23 యాసంగి, వానాకాలం సీజన్లకు సంబంధించి 6,86,541 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రొక్యూర్ చేసి మిల్లులకు పంపించింది. సామర్థ్యాన్ని అనుసరించి యాసంగి సీజన్‌కు సంబంధించి 2,99,858 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని 158 రైస్‌మిల్లులకు, వానాకాలం సీజన్‌కు సంబంధించి 3,86,683 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని 90 మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ కోసం పౌర సరఫరాల శాఖ కేటాయించింది. సివిల్ సప్లై శాఖ 2,03903 మెట్రిక్ టన్నుల యాసంగి సీజన్ బియ్యాన్ని మిల్లర్ల నుంచి సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 33,683 మెట్రిక్‌టన్నులే వచ్చాయి. నెలాఖరులోగా 1,70,220 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. అదేవిధంగా వానాకాలం సీజన్‌కు సంబంధించి 2,60,020 మెట్రిక్‌టన్నుల బియ్యానికి 2,03,489 మెట్రిక్ టన్నులను సేకరించారు. ఇంకా 44,194 మెట్రిక్‌టన్నులు అందించాల్సి ఉంది. అయితే నర్సాపూర్‌కు చెందిన మూడు రైస్‌మిల్లులలో ధాన్యం లేకపోవడంతో అధికారులు వాటిని సీజ్ చేశారు. ఇవి మూతపడడంతో ఆ మిల్లర్లు ఇవ్వాల్సిన 17,777 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ ప్రశ్నార్థకంగా మారింది.

ఇంత వరకు 82 శాతం వానాకాలం, 17 శాతం యాసంగి సీజన్ సీఎంఆర్ రికవరీ చేశాం. గత యాసంగి సీజన్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ అందించడానికి మిల్లర్లకు ప్రభుత్వం నుంచి మరికొంత గడువు లభించే అవకాశం ఉంది. కానీ యాసంగి సీజన్ సీఎంఆర్ మాత్రం నెలాఖరులోగా అందించకపోతే మిల్లర్లపై చర్యలు తప్పవు. ఇప్పటికే జిల్లాలో 68 మిల్లులకు సీఎంఆర్ కోటాను నిలిపివేశాం. గడువు మాత్రం పొడిగించే అవకాశం లేదు.

**నెలాఖరులోగా అప్పగించకపోతే చర్యలు తప్పవు**

- హరికృష్ణ, డీఎం, పౌరసరఫరాల శాఖ



### ఇంకా 2.14 లక్షల మెట్రిక్‌టన్నులు సేకరించాలి

పౌరసరఫరాల శాఖ మిల్లర్ల నుంచి సీఎంఆర్ బియ్యాన్ని సేకరించేందుకు నెలాఖరుతో గడువు ముగుస్తున్నది. రెండు సీజన్లకు కలిపి 2,14,414 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాల్సి ఉంది. గడువు ప్రకారం బియ్యాన్ని అందించడం సాధ్యమయ్యేలా లేదు. గడువులోగా కోటాను పూర్తి చేయని రైస్‌మిల్లులపై చర్యలకు ఉపక్రమించారు. సకాలంలో మిల్లింగ్‌కు సహకరించకపోవడంతో ఈసారి 68 రైస్‌మిల్లులకు 2023-24 సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ కోటాను నిలిపివేశారు.

## మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెంచాలి

- గంజాయి సాగు చేస్తే చర్యలు తప్పవు
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 17: మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చి వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, కిరాణ, మెడికల్ దుకాణాలపై నిఘా పెంచాలన్నారు. పాన్, కిరాణ షాపుల్లో విక్రయించే చాక్లెట్లు, ఇతర తినుబండారాలను పరిశీలించాలన్నారు. పారిశ్రామిక, కిరాణ, మెడికల్ దుకాణాల దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత తెలిసి, తెలియక మత్తుకు బానిసై బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. పిల్లల ప్రవర్తనలో మార్పు వస్తే పోలీస్ శాఖను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సూచిక బోర్డు, మూలమలుపుల దగ్గరు హెచ్చరికల బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు గుంతలను పూడ్చి వేయాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు మరమ్మతుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దేశంలో 3 నిమిషాలకో రోడ్డు ప్రమాదాలతో మరణిస్తున్నారని తెలిపారు. కొద్దిపాటి నిర్లక్ష్యం ఫలితంగా కుటుంబాలు రోడ్డు పాలవుతాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశాల్లో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, అదనపు ఎస్పీ మహేందర్, వివిధ శాఖాధికారులు డా.చందునాయక్, రజాక్, సుధా, రాధాకిషన్, సత్యనారాయణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

### ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ కళాశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలో వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉత్తమ, ఈఎస్ఎల్, బీఎల్‌వోలకు జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, డీఆర్వో పద్మశ్రీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ, వేదిక, బ్యాక్‌గ్రౌండ్, సిట్టింగ్ తదితర ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్, ఆర్డీవోలు అంబదాస్ రాజేశ్వర్, జయచంద్ర, శ్రీనివాస్, తహశీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో నెరవేరని మిషన్ భగీరథ లక్ష్యం

- సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీరెడ్డి
- జడ్పీ స్థాయి సంఘ సమావేశాల్లో సమస్యలపై చర్చ


స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, జనవరి 17 : అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ లక్ష్యం నెరవేరడం లేదని సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం కోట్లాది రూపాయాలు వెచ్చించి శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని సంకల్పిస్తే పలుచోట్ల మిషన్ భగీరథ ద్వారా నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. సంగారెడ్డిలోని జడ్పీ హాలులో చైర్‌పర్సన్ మంజూశ్రీరెడ్డి అధ్యక్షతన బుధవారం నాలుగు స్థాయి సంఘ సమావేశాలను నిర్వహించారు. ముందుగా గ్రామీణ అభివృద్ధి, విద్యా వైద్యం, ఆర్థిక, ప్రణాళిక, ఇతర పనులపై సభ్యులుగా ఉన్న జడ్పీటీసీలు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీరెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక చొరవచూపాలని సూచించారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండల కేంద్రాల నుంచి గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లన్నీ గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు రోడ్లను బాగుచేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశాల్లో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ జగదీష్, డీఎంహెచ్‌వో గాయిత్రి, జట్పీటీసీలు సుప్రజ, రమేశ్, రాజురాథోడ్, రాఘవరెడ్డి, సునీత, మల్లికార్జున్‌పాటిల్, అరుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## త్రిబుల్‌ఆర్‌పై ముందడుగు

- ఉత్తర భాగం భూసేకరణ వేగవంతం చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- భూసేకరణ పూర్తయితే పెరగనున్న రియల్ భూం

గజ్వేల్, జనవరి 17: త్రిబుల్ ఆర్(రీజనల్ రింగ్‌రోడ్డు)పై మరో ముందడుగు పడింది. ఉత్తరభాగం భూసేకరణను పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడం, భూసేకరణకు అయ్యే ఖర్చుతో పాటు రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అయ్యే రాష్ట్ర వాటాను పూర్తిస్థాయిలో అందిస్తామని ప్రకటించడంతో ఒక్కసారిగా రీజనల్ రింగ్‌రోడ్డుపై కదలిక వచ్చింది. ఉమ్మడి మెదక్, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఉత్తర భాగం నిర్మాణం జరుగుతుండగా సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, నల్గొండ జిల్లాల పరిధిలో దాదాపుగా 158.64 కిలోమీటర్ల మేర ఈ రీజనల్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. ఆయా జిల్లాల్లోని 20 మండలాలు, 111 గ్రామాల మీదుగా ఈ రీజనల్ రింగ్‌రోడ్డు వెళ్లనున్నది. భూపరిహారానికి రూ.5,200 కోట్లు, రోడ్డు నిర్మాణానికి రూ.8,600 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు. సిద్దిపేట జిల్లా పరిధిలో గజ్వేల్ డివిజన్‌లోనే ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. రాయపోల్, వర్గల్, గజ్వేల్, మర్కుక్, జగదేవ్‌పూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి 31.743 కిలోమీటర్ల మేర రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. సిద్దిపేట జిల్లా పరిధిలో దాదాపు 980 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. ఇప్పటికే భూసర్వే పూర్తి చేయడంతో పాటు హద్దులను ఏర్పాటు చేశారు.



### రియల్ వ్యాపారులకు కలిసొచ్చే అవకాశం

రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణ పూర్తయితే ఇప్పటి వరకు స్థిరంగా ఉన్న భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చే అవకాశాలు ఉన్నాయి. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలోని సంగారెడ్డి, నర్సాపూర్, గజ్వేల్ డివిజన్‌లలో భూముల ధరలు ఆకాశానికి తాకే అవకాశాలున్నాయి. ఇప్పటికే భూముల ధరలు భారీగా ఉండడం, ఇటీవల స్థిరాస్తి వ్యాపారం మందగించడం, ఎన్నికలు ఇతరత్రా కారణాలతో భూములపై పెట్టుబడి పెట్టేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. తాజా ప్రకటనతో భూముల ధరలకు రెక్కలు వచ్చే అవకాశాలున్నాయి. కొన్నాళ్లుగా వ్యాపారం లేక దిగాలుగా ఉన్న వారికి కలసొచ్చే అవకాశం ఉంది.

### భూయజమానుల్లో మొదలైన కలవరం

కొన్నాళ్లుగా రీజనల్ రింగ్ రోడ్డుపై ఉలుకుపలుకు లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకోగా, తాజాగా సీఎం ప్రకటనతో రైతుల్లో కలవరం మొదలైంది. ముఖ్యంగా నష్టపరిహారం విషయంలో దిగులు చెందుతున్నారు. గతంలో మాదిరిగా కాకుండా న్యాయ సమ్మతమైన ధరను చెల్లించాలని కోరుతుండగా, భూమికి భూమి అయినా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని, ఫారెస్ట్ మీదుగా రైతులకు నష్టం కలగకుండా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## రిటైర్ అయినా 17 ఏళ్లుగా విధుల్లోనే!

**కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న రిటైర్డ్ ఈఈ**

- ప్రభుత్వానికి నివేదించిన ఈఎన్‌సీ
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాల సేకరణ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 17 : ప్రభుత్వంలో కన్సల్టెంట్‌లుగా పనిచేస్తున్న వారితో పాటు ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా పనిచేస్తున్న రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల వివరాలను ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. స్పందించిన జిల్లా అధికారులు కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న రిటైర్డ్ అధికారి పేరును ప్రభుత్వానికి నివేదించారు. మైనర్ ఇరిగేషన్ శాఖలో ఒకరు కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. 17 ఏళ్లుగా రిటైర్డ్ ఈఈ ఉమ్మడి మెదక్ జిల్లా కన్సల్టెంట్‌గా కొనసాగుతున్నారని ఈఎన్‌సీ ప్రభుత్వానికి నివేదించారు.

### 2006 నుంచి కన్సల్టెంట్‌గా...

ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ పాలనలోనూ మైనర్ ఇరిగేషన్ శాఖకు ఉమ్మడి మెదక్ జిల్లా కన్సల్టెంట్‌గా రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లయ్య కొనసాగుతున్నారు. 2006లో సిద్దిపేట డివిజన్ మైనర్ ఇరిగేషన్ శాఖ ఈఈగా రిటైర్డ్ అయిన మల్లయ్య ఆ వెంటనే ఉమ్మడి జిల్లా కన్సల్టెంట్‌గా నియమితులయ్యారు. కన్సల్టెంట్‌గా ఇతనికి నెలకు రూ.75వేల వేతనం, కారు అలవెన్సులు కలిపి సుమారు రూ.1.08 లక్షల వరకు ప్రభుత్వం చెల్లిస్తున్నది. కన్సల్టెంట్‌గా ఇతను మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి సాంకేతిక సలహాలను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కన్సల్టెంట్‌గా నియమితులైనప్పటి నుంచి జిల్లా మంత్రులతో సత్సంబంధాలు ఏర్పరుచుకున్న మల్లయ్య ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ శాఖలో సుప్రీంగా చెలామణి అయ్యారన్న విమర్శలున్నాయి. కన్సల్టెంట్ లేకుండా మైనర్ ఇరిగేషన్ శాఖ కార్యకలాపాలపై కలెక్టర్లు సైతం సమీక్ష చేయలేకపోయారంటే ఆయనపై ఎంతగా ఆధారపడ్డారో తెలుస్తున్నది. కన్సల్టెంట్‌గా ఆయన ఎలాంటి సలహాలు ఇచ్చారో.. ఉమ్మడి జిల్లాలో మైనర్ ఇరిగేషన్‌శాఖ ద్వారా ఏ రకంగా రైతులకు ప్రయోజనం చేకుర్చారో ఆయనను నియమించిన పాలకులకు, అధికారులకు తెలియాలి. మైనర్ ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ రాష్ట్రంలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న ఒకే ఒక్క అధికారి మల్లయ్య గురించి ప్రభుత్వానికి నివేదించారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మురళీధర్ కూడా 'ఆంధ్రజ్యోతి'తో ధ్రువీకరించారు.

### ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై ఆరా

ఇలా ఉండగా జిల్లాలోని వివిధ ప్రభుత్వం విభాగాల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానం ద్వారా రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులు ఎందరు పనిచేస్తున్నారనే అంశంపై జిల్లా యంత్రాగం వివరాలు సేకరిస్తున్నది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి రెండు రోజుల కిందటే ఉత్తర్వులు అందాయి. దీని ప్రకారం జిల్లాలోని ఏఏ శాఖలో ఎందరు రిటైర్డ్ ఉద్యోగులు పనిచేస్తున్నారో తెలపాలని జిల్లా యంత్రాంగం నుంచి వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు అందాయి. ఒకటి, రెండు రోజుల్లో జిల్లాలోని అన్ని శాఖల నుంచి పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల వివరాలు అందగానే జిల్లా సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిసింది.

## జాతీయస్థాయి క్రికెట్ జట్టుకు సంగారెడ్డి వాసి ఎంపిక

సంగారెడ్డి అర్బన్, జనవరి 17 : జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు సంగారెడ్డికి చెందిన నెవిన్ మానిత్ ఎంపికయ్యారు. సంగారెడ్డిలోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి నెవిన్ మానిత అండర్-17 పోటీలకు సెలక్ట్ అయ్యాడు. బీహార్ రాష్ట్రం పాట్నాలో జరిగే 67వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో క్రికెట్ ఆడనున్నారు. ఇటీవల గద్వాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో తలపడి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నెవిన్ మానితను ఎంఎస్ క్రికెట్ అకాడమీ కోచ్‌లు శ్రీనాథ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పాఠశాల యాజమాన్యం అభినందించారు.


నెవిన్ మానిత్






## దావోస్ పర్యటనలో మెదక్ ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి విదేశీ పర్యటనలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కూడా వెళ్లారు. స్విట్జర్లాండ్ దేశంలోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య కేసులో మహిళకు మూడేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, జనవరి 17: తనను ప్రేమించాలని వేధించి యువకుడి ఆత్మహత్యకు కారణమైన మహిళకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా అదనపు న్యాయాధికారి ఎం.రాధాకృష్ణ చౌహాన్ బుధవారం తీర్పు చెప్పారు. పెద్ద శంకరంపేట మండలం వీరోజిపల్లికి చెందిన సుంకరి అలియాస్ మేకల మొగులమ్మ(40) పటాన్‌చెరులోని చైతన్యనగర్ కాలనీలో నివాసముండేది. అదే కాలనీలో నివాసముంటున్న చిలకముక్కుల లింగం(20)తో ప్రేమ వ్యవహారం కొనసాగేది. పెద్దల సమక్షంలో వీరిద్దరి పంచాయితీ జరుగగా వారి నిర్ణయం మేరకు వేర్వేరుగా ఉంటున్నారు. అయితే మొగులమ్మ తనను ప్రేమించాలని అలాగే రూ.60 వేలు తీసుకుని రావాలని పలుమార్లు వేధించడంతో లింగం 2019 జూలై 24న పటాన్‌చెరులోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కొడుకు ఆత్మహత్యకు కారణమైన మొగులమ్మపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి కిషన్ పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పూర్తి వివరాలను కోర్టులో సమర్పించగా నేరం రుజువు కావడంతో నిందితురాలు మొగులమ్మకు మూడేళ్ల జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో నెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా అదనపు న్యాయాధికారి ఎం.రాధాకృష్ణ చౌహాన్ బుధవారం తీర్పు చెప్పారు.

## మురుగునీటిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

చేగుంట, జనవరి 17: చేగుంట గ్రామ శివారులోని శ్రీవేంకటేశ్వర అచరీస్ కంపెనీ, అయిత దివాకర్ ఇంటి సమీపంలోని మురుగునీటిలో గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. ఎస్ఐ హరీశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వేంకటేశ్వర అచరీస్ కంపెనీ సమీపంలో 65 ఏళ్ల వ్యక్తి మురుగునీటిలో పడి చనిపోయి ఉన్నాడు. ఒంటిపైన మెరూన్ రంగు గీతల షర్టు, నలుపు రంగు ప్యాంట్, కుడి చేతికి రుద్రాక్ష దారం మాలతో పాటు స్టీల్ కడెం ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. చేగుంట గ్రామపంచాయతీ ఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే చేగుంట పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

## నాగులపల్లిలో మట్టి టిప్పర్ల పట్టివేత


పట్టుబడిన మట్టి టిప్పర్లు

తూప్రాన్, జనవరి 17: తూప్రాన్ మండలం నాగులపల్లి శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. నాగులపల్లి శివారు నుంచి మంగళవారం రాత్రి అక్రమంగా మట్టి తరలింపు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి ఆధ్వర్యంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నట్లు రెండు టిప్పర్లను పట్టుకున్నారు. పట్టుకున్న టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరి వివరించారు.

# పూతలేని మామిడి


పూతలేని మామిడిచెట్టు

● ఆందోళనలో అన్నదాతలు
● వాతావరణంలో మార్పులే కారణం
● సిద్దిపేట జిల్లాలో 13 వేల ఎకరాల్లో మామిడి తోట సాగు

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 17: పండ్ల తోటల్లో ముఖ్యమైనది మామిడి సాగు. అయితే ఈసారి చెట్లపై ఆశించిన స్థాయిలో పూత రావడం లేదు. ఈ సీజన్‌లో కొన్ని ప్రాంతాల్లో 20 శాతం తోటల్లో చెట్లు పూతపూయగా.. మరో 50 శాతం తోటల్లో ప్రస్తుతం చెట్లు మొగ్గదశకు వచ్చాయి. ఇంకనూ 30 శాతం తోటల్లో పూతరాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి మామిడిలో పూత, కాత ఆధారపడి ఉంటుంది. నవంబరు, డిసెంబరు మాసాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 13.5-18 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైతేనే పూత సరిగా వస్తుంది. కానీ ఈసారి నవంబరు, డిసెంబరు మాసాల్లో ఉష్ణోగ్రతల్లో 10-20 డిగ్రీల సెల్సియస్ స్థాయిలో భారీ హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. తక్కువ ఉష్ణోగ్రతలతో కాడల్లో పూతకట్టదు, పూతకట్టినవి బయటకు విచ్చుకోవు. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగినప్పుడు ముందుగా వచ్చిన పూత రాలిపోతుంది. ఇలా రెండు దశల్లో మామిడికి నష్టం వాటిల్లగా ఆలస్యంగా పూతవచ్చిన తోటల్లో ముదిరే ఎండలకు చిన్నకాయలు ఉడికి రాలిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నీటి లభ్యత ఎక్కువగా ఉన్నపుడు మొక్కల చిగుర్లు ఎక్కువగా వచ్చి పూతరావటం లేదు.

సిద్దిపేట జిల్లాలో 13 వేల ఎకరాల్లో రైతులు మామిడిని సాగు చేశారు. ఇందులో 90 శాతానికిపైగా బంగినపల్లి రకాలుండగా... మిగిలిన విస్తీర్ణంలో దశేరి, తదితర రకాలను రైతులు సాగుచేస్తున్నారు. చలికాలంలో పచ్చిపూత ఏర్పడి కాయలు బఠానిగింజ పరిమాణం దాటితేనే ఎండలు ముదురుతున్నకొలదీ కాయలు సమర్థంగా ఎదుగుతాయి. కానీ ఈసారి కొన్నిచోట్ల ఆలస్యం కావటం, పూత, కాత వచ్చినా నిలవకపోవటం, కాయలు చిన్నగా ఉండటం తదితర సమస్యలు తలెత్తనున్నాయి.


నంగునూరు మండలంలోని వెంకటపూర్‌లో పూత లేని మామిడి తోట

### సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మామిడి సాగుచేస్తున్న రైతులు పూతరాని చోట ప్రస్తుతం డ్రిప్ ద్వారా లేదా కాలువల ద్వారా పూర్తిస్థాయి నీటి తడిని ఇవ్వాలి. అయినా పూత రాకుంటే నేలలో నీటి తడి ఆరిన తర్వాత మరో తడిని ఇవ్వవచ్చు. రసం పీల్చు, పురుగు, బూడిద తెగులు నివారణతో పాటుగా పూమొగ్గలు రావడానికి, పూమొక్కలు విచ్చుకునేందుకు లీటరు నీటిని 2 మి.లీ మోనోక్రోటోఫాస్, 3 గ్రాముల వెట్టబుల్ సల్ఫర్, 10 గ్రాముల 19-19-19ను కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. పచ్చిమొగ్గ, పచ్చిపూత దశలోనే మందులను చల్లాలి. తోటలకు నీటిని పారించాలి. తెల్లపూత దశలో మందులను పిచికారీ చేయవద్దు, నీటిని మామిడి చేట్లకు అందించవద్దు.

**- భాస్కర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి, సిద్దిపేట**

## రేపు ఐఐటీహెచ్‌లో ఇన్వెంటివ్ ఇన్నోవేషన్ ఫెయిర్

● ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్


ఐఐటీ హైదరాబాద్

కంది, జనవరి 17: సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీహెచ్)లో దేశంలోని విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానం కోసం రేపు (ఈ నెల 19న) తేదీల్లో ఐఐటీహెచ్‌లో 'ఇన్వెంటివ్-2024' పేరుతో మెగా ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇన్వెంటివ్ ఇన్నోవేషన్ ఫెయిర్‌కు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్‌లో తొలిసారిగా 19, 20వ తేదీల్లో మెగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డి) ఫెయిర్ 2వ ఎడిషన్‌లో సాంకేతిక పురోగమనాల వేడుక ఉంటుందన్నారు. ఈ వేడుకలో దేశంలోని అన్ని ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలతోపాటు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కలిగిన 120 ఉన్నత విద్యాసంస్థలు పాల్గొననున్నాయి. దీనికోసం పరిశోధన, ఆవిష్కరణల సమగ్ర ప్రభావాన్ని హైలైట్ చేయడానికి ఐఐటీహెచ్ వేదిక అవుతున్నదన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వాతావరణ మార్పు, ఇ-మొబిలిటీ, క్లీన్‌ఎనర్జీ, స్థిరమైన సాంకేతికతలు, రక్షణ, అంతరిక్షం, పరిశ్రమలు వంటి ఐదు కీలక అంశాలపై సరికొత్త ఆవిష్కరణల ప్రదర్శనలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుక అట్టడుగు స్థాయిలో ఆవిష్కరణల అభివృద్ధికి చేరుకోవడానికి రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, సంస్థలు, పరిశ్రమల మధ్య సహకార మార్గాలను అన్వేషిస్తున్నదని వెల్లడించారు. పరిశోధకుల జ్ఞాన మార్పిడికి విలువైన అవకాశాలను అన్వేషించడానికి ఇదొక చక్కటి వేడుక అన్నారు. ప్రపంచ సవాళ్లను అధిగమించే సాంకేతిక పురోగతులను ముందుకు తీసుకెళ్లేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించడం ద్వారా ఈ ఈవెంట్ డైనమిక్ ప్లాట్‌ఫారమ్‌గా పనిచేస్తున్నదని వివరించారు. ఈ సహకారం మా పరిశోధనా ప్రయత్నాలను సద్వినియోగం చేస్తూ, పారిశ్రామిక పెట్టుబడులను సులభతరం చేస్తున్నదన్నారు. భారతదేశం, ప్రపంచ మార్కెట్ కోసం రూపొందించిన ఉత్పత్తుల ఆవిష్కరణకు దారి తీస్తున్నదని మూర్తి ఆకాంక్షించారు.

## రైతులు ఆదాయం పెంచుకునే విధంగా కృషిచేయాలి


కేవీకేలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం క్రిష్ణతేజ

జహీరాబాద్, జనవరి 17: మారుతున్న కాలానుగుణంగా రైతులు ఆదాయం పెంచుకునే విధంగా కృషిచేయాలని నాబార్డు డీడీఎం క్రిష్ణతేజ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అల్గోల్ గ్రామ శివారులోగల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో పలువురు మహిళా రైతులకు వివిధరకాల వ్యవసాయ పనిముట్లను అందజేసి మాట్లాడారు. మార్కెట్లో చిరుధాన్యాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు వాటి సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా రైతులు ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయం చేస్తే మరింత లాభాలను సాధించగలుగుతారని పేర్కొన్నారు. రైతులు వారి వారి వ్యవసాయ భూముల్లో ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేయించుకుని ఏ రకమైన పంటలను వేస్తే ప్రయోజనం ఉంటుందనే విషయాన్ని గ్రహిస్తూ అధికారుల, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను విధిగా పాటించాలన్నారు. అత్యవసరమనిపించిన వారికి నాబార్డు సహాయం అందిస్తామని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా పలువురు మహిళా రైతులకు చిరుధాన్యాల సాగుకు అనువైన నేలలు, ఎరువు తయారీ, సాగులో మెళకువలు, కషాయాల తయారీ, వివిధరకాల చిరుధాన్యాల ఉత్పత్తుల ప్యాకింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు హేమలత, స్నేహలత, డీడీఎస్ మహిళలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వద్దకు దుబ్బాక మున్సిపల్ పంచాయితీ!

● చైర్‌పర్సన్‌ను దించాల్సిందేనంటున్న కౌన్సిలర్లు
● రాజీనామా చేయకుంటే, అవిశ్వాసమే?
● 16 మంది సభ్యులతో సంతకాల సేకరణ

దుబ్బాక, జనవరి 17: దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ఆమె భర్త భూంరెడ్డి వ్యవహార శైలిపై కౌన్సిలర్లలో నెలకొన్న అసమ్మతి పంచాయితీ బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వద్దకు చేరింది. రెండేళ్లుగా ఉన్న అసంతృప్తిని మాజీ మంత్రి హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి చొరవతో సద్దుమణిగినా, తాము ఇక ఏగలేమంటూ నెల రోజులుగా కౌన్సిలర్లంతా అసమ్మతి సెగలతో మండిపోతున్నారు. ఇదే క్రమంలో వీరి అభిప్రాయం తానే స్వయంగా సేకరించేందుకు గురువారం సమావేశం కావాల్సిందిగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి కౌన్సిలర్లను ఆదేశించారు. గురువారం అసమ్మతికి చెందిన 16 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే వద్దకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. మంగళవారమే దుబ్బాకలోని ఒక కౌన్సిలర్ ఇంట్లో సమావేశమైన 16 మంది సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. దుబ్బాక మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై చర్చ జరిపినట్లు తెలిసింది. తాము ఎట్టి పరిస్థితిలో చైర్‌పర్సన్‌ను కొనసాగించలేమనీ, తామంతా కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టి, క్యాంపునకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నా.. అధిష్ఠానం మీద గౌరవంతో సహనంతో ఉంటున్నామని వారు వాపోయారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వినిపించనున్నారు. తమ మాటకు ప్రాధాన్యం ఇవ్వకుంటే తమ దారి తాము చూసుకుంటామని అంటున్నారు. వీరి వ్యవహారంపై అధికార పార్టీ కూడా నిఘా వేసినట్టు తెలిసింది.

**ఎమ్మెల్యేను కలిసిన చైర్‌పర్సన్ భర్త, వైస్ చైర్‌పర్సన్ భర్త**

కౌన్సిలర్ల వ్యవహారంలో బుధవారం చైర్‌పర్సన్ గన్నె వనిత భర్త భూంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ భర్త బాలకిషన్ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని కలిశారు. దుబ్బాక మున్సిపల్ వ్యవహారం తలనొప్పిగా మారడంతో ఎమ్మెల్యేను వీరు కలవడం ప్రాధాన్యం సంతరించుకున్నది. అయితే కౌన్సిలర్ల అసంతృప్తి పట్ల చైర్‌పర్సన్ భర్త భూంరెడ్డిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గురువారం తాను అసంతృప్తి కౌన్సిలర్లతో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని తేల్చిచెప్పినట్టు తెలిసింది. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కౌన్సిలర్లు ఆస యాదగిరి కూడా ఉన్నారు.

# మల్లన్న హాల్ట్‌స్టేషన్‌కు రైల్వేబోర్డు అనుమతి

● తిమ్మారెడ్డిపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ఏర్పాటుకు చర్యలు


రైల్వేహాల్ట్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రదేశం

చేర్యాల, జనవరి 17: కొమురవెల్లి మల్లన్న చెంత రైల్వేహాల్ట్‌స్టేషన్ ఏర్పాటుకు కేంద్ర రైల్వేశాఖబోర్డు ఎట్టకేలకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. దీంతో మల్లన్న భక్తుల రైల్వేస్టేషన్ కల సాకారానికి నెలకొన్న అడ్డంకులు తొలగిపోనున్నాయి. తెలంగాణలోని ప్రముఖ శైవక్షేత్రాలలో ప్రధానమైన మల్లికార్జునస్వామి కొలువైన కొమురవెల్లి మీదుగా కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ చేపట్టారు. కానీ రైల్వేస్టేషన్ల జాబితాలో కొమురవెల్లి లేకపోవడంతో స్థానికంగా హాల్ట్‌స్టేషన్ ఏర్పాటుచేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ విషయమై గవర్నర్ తమిళిసై, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సహా పలువురు నేతలు హామీఇచ్చారు. గతేడాది ఏప్రిల్ 20న ఎంపీ బండి సంజయ్ రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సంప్రదించడంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించారు. దీంతో రైల్వే అధికారులు స్థానిక పరిస్థితులు పరిశీలన జరిపారు. హాల్ట్‌స్టేషన్ ప్రతిపాదిత స్థలం ఎత్తు పల్లాల మధ్యన ఉండటం, సిగ్నలింగ్‌తో పాటు ప్రత్యామ్నాయ చర్యలన్నీ రూలింగ్ గ్రేడ్ పరిధిలో ఉండటం వల్ల కేంద్ర రైల్వే బోర్డు అనుమతి తప్పనిసరి కావడంతో ప్రతిపాదనలు పంపించింది. ఈ విషయమై రైల్వేశాఖ డీఆర్ఎం కొద్దిరోజుల క్రితం మల్లన్న ఆలయానికి వచ్చి వివరాలు వెల్లడించారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారు తిమ్మారెడ్డిపల్లి కమాన్ స్వాగత తోరణం సమీపంలోని రైల్వే అండర్‌బ్రిడ్జి నుంచి గ్రామానికి వెళ్లే ఆర్‌వోబీ మధ్యన స్థలాన్ని ప్రతిపాదించారు. తాజాగా కేంద్ర రైల్వేబోర్డు అనుమతి పొందిన క్రమంలో టెండర్ల నిర్వహణ, భూసేకరణతో పాటు పనుల ప్రారంభానికి నెలకొన్న ఆటంకాలు తొలగిపోనుండటంతో కొన్నాళ్లలోనే మల్లన్న హాల్ట్‌స్టేషన్ అందుబాటులోకి రానున్నది. సిద్దిపేట నుంచి తిరుపతికి వెళ్లే రైలుతో పాటు మరిన్ని రైళ్లను రానున్న రోజుల్లో హాల్ట్‌చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

## గ్రామీణ ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగు పెరగాలి: డీడీఎస్


గొడిగర్‌పల్లిలో పాత పంటల జాతరను నిర్వహిస్తున్న దృశ్యం

కోహీర్ జనవరి 17: గ్రామీణ ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగు పెరగాలని డీడీఎస్ సూపర్‌వైజర్ వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని గొడిగర్‌పల్లి గ్రామంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సభ్యులు బుధవారం చిరుధాన్యాల విశిష్టతను వివరిస్తూ పాత పంటల జాతర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ రైతు సంగన్న ఎడ్ల బండ్లకు పూజ చేసి బండ్ల ఊరేగింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎస్ సంఘం మహిళలు పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ విత్తనాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపులో గ్రామ ప్రజలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పాత పంటల అవశ్యకత తెలియజేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలుసుకోవడమే కాకుండా వాటిని పండించాలన్నారు. చిరుధాన్యాల ఆహారాన్ని తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తున్నదని చెప్పారు. అంతరించిపోతున్న చిరుధాన్యాల పంటలను తిరిగి పండించే విధంగా గ్రామీణ రైతుల ప్రోత్సహించాలని సూచించారు. సాధారణ పంటల కన్నా చిరుధాన్యాల పంటలకు ప్రస్తుతం ఆదరణ ఎక్కువగా ఉన్నదన్నారు. చిరుధాన్యాలతో చేయబడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు ఎక్కువ కాలం జీవించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనుసుజతుక్కప్ప, రైతులు రాములు, కనకరాజు, ఎంపీటీసీ భీమ్‌సింగ్, డీడీఎస్ సిబ్బంది చుక్కమ్మ, చిన్న నర్సమ్మ, జనరల్ నర్సమ్మ, మంజుల, లక్ష్మయ్య, పులమ్మ, వినయ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ దాడిలో పట్టుబడ్డ బల్దియా ఉద్యోగి

● రూ.8 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండ్‌గా చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ● ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సైతం పట్టివేత


ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డ డబ్బులు

సదాశివపేట, జనవరి 17: ఏసీబీ దాడిలో ఇద్దరు బల్దియా ఉద్యోగులు పట్టుబడ్డారు. రూ.8 వేల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట పట్టణానికి చెందిన ఆకుల సంగమేశ్వర్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ సమీపంలో మున్సిపల్ అనుమతులతో ఏర్పాటు చేసిన (ఈకోవాల్యూ) అధికారిక వెంచర్‌లో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగం పూర్తిస్థాయి అనుమతులతో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణం పూర్తికాగానే ఇంటి నెంబర్ కేటాయించాలని మున్సిపల్ రెవెన్యూ విభాగంలో 2023 సెప్టెంబరు 25న దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు లీగల్‌గా కావాల్సిన అన్ని డాక్యుమెంట్స్‌ను సమర్పించాడు. ఇంటి నెంబర్ కేటాయించాలని సంగమేశ్వర్ కుమారుడు ఆకుల శివకుమార్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పతంగి వెంకట్రావ్, అదే విభాగానికి సంబంధించి పలు రకాల దరఖాస్తులను పరిశీలించే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వేణు చుట్టూ నాలుగు నెలల నుంచి తిరిగాడు. చివరకు రూ.10 వేలు ఇస్తేనే ఇంటి నెంబర్ కేటాయిస్తామని ఆర్ఐ వెంకట్రావ్, ఓఎస్ ఉద్యోగి వేణు చెప్పారు. దీంతో శివకుమార్ 2023 డిసెంబరు 22న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ ఆనంద్‌కుమార్, ఆ శాఖ సీఐ వెంకట్‌రాజ్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ రమేష్ రంగంలోకి దిగి బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఐ వెంకట్రావ్, ఓఎస్ ఉద్యోగి వేణుకు శివకుమార్ రూ.8 వేలు అందజేశాడు. అంతకుముందే కార్యాలయం ఆవరణలో మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిపై సెక్షన్ 7(బీ), సెక్షన్ (12)ల కింద కేసులు నమోదు చేశామన్నారు.

**గతంలోనూ ఏసీబీ దాడులు**

ఏసీబీ దాడులు సదాశివపేట మున్సిపాల్టీకి కొత్తేమి కాదు. గతంలో 2005-06 మధ్యకాలంలో ఓ ఉద్యోగి ఏసీబీ దాడుల్లో పట్టుబడగా, 2014-15లో స్వయనా మున్సిపల్ ఇంజనీర్ పట్టణంలో హైమాస్ట్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటులో కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఇక 2018 సంవత్సరం డిసెంబరులో టౌన్‌ప్లానింగ్ (టీపీఓబీ), ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒకరు ఓ బహుళ అంతస్తుల భవన నిర్మాణం విషయంలో రూ.70వేలు లంచం తీసకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ వలకు చిక్కారు. కాగా మున్సిపల్‌లో పలు సందర్భాల్లో ఏసీబీ అధికారుల దాడుల నుంచి ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తప్పించుకోవడం గమనార్హం.


విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్

## అప్పులబాధతో యువరైతు ఆత్మహత్య


నర్సింహులు (ఫైల్)

కౌడిపల్లి, జనవరి 17: అప్పులబాధతో యువరైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రానికి చెందిన బర్ల సాయిలుకు ఎకరంన్నర పొలం ఉన్నది. వ్యవసాయ పనులను కొడుకు నర్సింహులు(21) చూసుకుంటున్నాడు. అయితే ఆరునెలల క్రితం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో రూ.1.50 లక్షల లోన్ తీసుకుని రెండు బోర్లు వేయించాడు. అయినా చుక్క నీరు పడలేదు. దీంతో తండ్రి సాయిలు మందలించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి గోల్డ్ లోన్‌తో పాలు ప్రైవేట్‌గా మరో రూ.3 లక్షల వరకు అప్పు ఉన్నదని తెలిపారు.

## బోనాల బండ్ల ఊరేగింపులో అపశృతి

● బండి చక్రం కింద పడి యువకుడి మృతి


బాబు (ఫైల్)

రాయపోల్, జనవరి 17: బోనాల బండ్ల ఊరేగింపులో అపశృతి చోటు చేసుకున్నది. బండి చక్రం కిందపడి యువకుడు మృతిచెందాడు. రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా రెండురోజులు బోనాల బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు. కాగా మంగళవారం సాయంత్రం బోనాల బండ్లను ఊరేగిస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన దాసరి బాబు(27) ప్రమాదవశాత్తు బండి చక్రం కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడి తండ్రి దాసరి నాంపల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు. కాగా మృతుడికి ఏడాది క్రితమే వివాహం అయ్యింది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బైక్‌ను ఢీకొన్న టిప్పర్, యువకుడి మృతి


సాయిప్రసాద్(ఫైల్)

నారాయణఖేడ్, జనవరి 17: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన జట్ల సాయిప్రసాద్(32) మంగళవారం సాయంత్రం బైక్‌పై నారాయణఖేడ్ వైపు నుంచి లింగాపూర్ వెళ్తుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిప్రసాద్‌కు తీవ్రగాయాలు కావడంతో అతడిని నారాయణఖేడ్ ఆస్పత్రి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి చిన్నాన్న జట్ల విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి వివరించారు. మృతుడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారని, అతడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి


మృతిచెందిన మహిళ

సంగారెడ్డి క్రైం, జనవరి 17: సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందినట్లు పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి హైదరాబాద్‌లోని బాలానగర్ ఫతేనగర్‌కు చెందిన ఎర్రోళ్ల భూదమ్మ(50) చికిత్స నిమిత్తం 8న ప్రభుత్వ ఆసుపత్రికి ఒంటరిగా వచ్చింది. అయితే చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, ఆమె ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు

మెదక్ అర్బన్, జనవరి 17: వీధి కుక్కలు దాడిచేసి బాలుడిని గాయపర్చిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని జంబికుంటలో చోటు చేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. జంబికుంట వీధికి చెందిన తైమూర్ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. వీధి కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడిచేసి గాయపర్చాయి. వెంటనే తైమూర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తండ్రి అబ్దుల్ షాకీర్ తెలిపారు. గాయపడ్డ బాలుడు తైమూర్‌తో తండ్రి షకీర్, అతని కుటుంబసభ్యులు ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఓవైసీ బాలుడికి మెరుగైన వైద్యసేవలు అందిచేలా చూడాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌కు సూచించారు. దీంతో ఎమ్మెల్యే బాలుడికి మెరుగైన చికిత్స అందించేలా చూడాలంటూ తెలంగాణ ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినాను కోరారు. ఈ మేరకు సరోజిని కంటి ఆస్పత్రిలో బాలుడికి మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి సరోజినీ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

## దాడిచేసిన వ్యక్తికి రిమాండ్

జహీరాబాద్, జనవరి 17: జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్ చౌరస్తాలో గల అంబిక మెడికల్ దుకాణం యజమాని వైద్యనాథ్‌ను దుకాణాన్ని ఖాళీ చేయాలంటూ చాకుతో బెదిరిస్తూ.. దాడిచేసి గాయపరిచిన కేసులో శాంతినగర్‌కు చెందిన ఇక్బాల్‌అహ్మద్‌ను బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. 2023 అక్టోబరు 8న శాంతినగర్‌కు చెందిన ఇక్బాల్ అహ్మద్ దాడి చేశాడన్నారు. అప్పట్లో కేసు నమోదు చేశామని, కానీ నిందితుడు పరారీలో ఉండగా బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. న్యాయాధికారి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

## వుడ్ వర్క్‌షాప్‌లో అగ్నిప్రమాదం

● రూ.8 లక్షల ఆస్తి నష్టం ● రామాయంపేటలో ఘటన

రామాయంపేట, జనవరి 17: పట్టణంలోని ఓ వుడ్ వర్క్‌షాప్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఘటనలో రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. పట్టణానికి చెందిన వడ్ల శ్రీనివాస్ తమ ఇంటిని ఆనుకుని ఉన్న స్థలంలోనే చిన్నపాటి మిషన్ ఏర్పాటు చేసుకుని నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిగించే తలుపులు, చౌకోట్లు తయారు చేస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని టేకు బెండ్లు, ఇతర విలువైన కట్టెలు సమకూర్చుకుని నిల్వచేశాడు. అయితే మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని వర్క్‌షాపులో పెద్దగా మంటలు ఎగిసిపడ్డాయి. అవి శ్రీనివాస్ ఇంటిని చుట్టేలోపు పొరుగున ఉన్నవారు గమనించి అప్రమత్తం చేశారు. దీంతో ఆ కుటుంబం చిన్నటి డోర్ నుంచి బయటికి రాగా ముప్పు తప్పింది.

## సంగారెడ్డిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 17: సంగారెడ్డిలోని పలు హోల్‌సెల్ కిరాణం షాపు, రెస్టారెంట్లలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు చేశారు. డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ టి.విజయ్‌కుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎం.ఏ.ఖలీల్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేంద్ర పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ఓ కిరాణా హోల్‌సెల్‌తో పాటు కొత్త బస్టాండ్ సమీపంలోని మరో హోల్‌సెల్ కిరాణం షాపులో తనిఖీలు చేసి శాంపిళ్లను సేకరించారు. అదేవిధంగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు చేసిన అధికారులు వంట గది అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుభ్రంగా లేకపోతే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ పొందాలని, లైసెన్స్ లేకుండా విక్రయించడం చట్ట విరుద్ధమన్నారు.

## అంతర్జాతీయ సాహస శిబిరానికి తారా విద్యార్థుల ఎంపిక


రంజిత్‌రెడి


అమర్


రాజేశ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 17: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మూడురోజుల పాటు ఒడిస్సాలో జరిగే అంతర్జాతీయ సాహస శిబిరానికి ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ సహకారంతో ప్రాజెక్ట్ పాయింట్, ప్రేరణ ఆధ్వర్యంలో ఒడిస్సాలోని కోర్దాలో ఫిబ్రవరి 10 నుంచి 12 వరకు జరిగే శిబిరంలో కళాశాలకు చెందిన రంజిత్‌రెడ్డి, అమర్, రాజేశ్‌లు పాల్గొననున్నారు. మూడురోజుల పాటు జరిగే ఈ శిబిరంలో ట్రెక్కింగ్ వంటి అంశాలలో శిక్షణ పొందనున్నారు. సాహస శిబిరానికి ముగ్గురు విద్యార్థుల ఎంపికకావడం పట్ల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

# అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**అర్హులైన ప్రతీ ఒక్కరు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. బుధవారం ఓటరు నమోదుపై పలు పట్టణాలల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ నెల 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులు కూడా చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.**

జోగిపేట, జనవరి 17: జోగిపేట ఆర్డీవో పాండు ఆధ్వర్యంలో జోగిపేట్‌లో పట్టణంలో బుధవారం అధికారులు ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జోగిపేటలోని క్లాక్ టవర్ నుంచి ప్రధాన వీధుల గుండా అందోలు పట్టణం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు అంథోనీ, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, జోగిపేట ఎస్ఐ అరుణ్ గౌడ్, మెప్మా టీఎంసీ భిక్షపతిగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, నెహ్రూ స్మారక డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



కంగ్టిలో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు



కందిలోని లక్ష్మీనగర్‌కాలనీలో ఓటు హక్కుపై టాన్స్‌జెండర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

### జహీరాబాద్‌లో

జహీరాబాద్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డు మీదుగా జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ అధికారులు ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్ఐలు శ్రీకాంత్, ప్రసాద్, మున్సిపల్, మెప్మా, తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

### పటాన్‌చెరులో

పటాన్‌చెరు: ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ సిబ్బంది బుధవారం పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో బైక్ ర్యాలీలు నిర్వహించారు. పటాన్‌చెరు మైత్రీ మైదానం నుంచి రామచంద్రాపురం తహసీల్దార్ కార్యాలయం వరకు, రామచంద్రాపురం తహసీల్దార్ కార్యాలయం నుంచి పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓటరు నమోదు ఆవశ్యకత తెలిసేలా నినాదాలు చేస్తూ బ్యానర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ తహసీల్దార్లు భాస్కర్, గౌరీవత్సల, డిప్యూటీ తహసీల్దార్లు విశ్వేశ్వర్, బాల్‌రాజ్, కార్తీక్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

### వట్‌పల్లిలో

వట్‌పల్లి: కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు వట్‌పల్లిలో తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అశోక్, ఎస్ఐ కోటేశ్వరరావు, నాయకులు గోపాల్‌రెడ్డి, సంగారెడ్డి, దిగంబరరావు, కుమ్మరి పెద్దన్న, నరసింహ గౌడ్, వెంకట్‌రావు, గురుచరణం పాల్గొన్నారు.

### రాయికోడ్‌లో 2కే రన్

రాయికోడ్: రాయికోడ్‌లో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2కే రన్‌ను నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి 2కే రన్ నిర్వహిస్తూ ఓటు విలువ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశం, ఏఎస్ఐ ఇక్బాల్ హుస్సేన్, ఆర్ఐలు రాంచందర్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



జోగిపేటలో బైక్ ర్యాలీలో పాల్గొన్న అధికారులు

### కంగ్టిలో 2కే రన్

కంగ్టి: ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం మండల కేంద్రమైన కంగ్టిలో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, డిప్యూటీ తహసీల్దార్ జుబేద్, కార్యదర్శి సుభాష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, యువజన సంఘాల సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

### ఓటు హక్కుపై టాన్స్‌జెండర్లకు అవగాహన

కంది: కందిలోని లక్ష్మీనగర్‌కాలనీలో బుధవారం తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై టాన్స్‌జెండర్లకు అవగాహన కల్పించారు. కంది లక్ష్మీనగర్‌కాలనీలో నివసిస్తున్న 21 మంది ట్రాన్స్‌జెండర్లకు ఇతరుల కోటాలో ఓటు హక్కును కల్పించారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన ఫామ్ 6,7,8, 8ఏ లపై తహసీల్దార్ నూతన ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

## రూ.60 లక్షల విలువైన ఆభరణాల చోరీ

**● పని చేస్తున్న ఇంటికే కన్నం వేసిన ప్రబుద్ధుడు**

రాయదుర్గం, జనవరి 17: తాను పనిచేస్తున్న ఇంటినే దోచేసి సుమారు రూ.60 లక్షల విలువైన బంగారు, వజ్రాభరణాలతో ఉడాయించాడు. ప్రధాన నిందితుడితో పాటు సహకరించిన మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని 963 గ్రాముల బంగారు, వజ్రాభరణాలను, రూ.2.80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ డీసీపీ వినీత్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముప్ప ఇంద్ర ప్రస్థాలోని ఓ విల్లాలో సుజాత నివాసముంటున్నది. తన ఇంట్లో పని చేసే చందన్, ఒడిస్సాకు చెందిన ప్రభాకర్ మల్లిక్(27)లకు ఇంటిని అప్పగించి వ్యక్తిగత పనిమీద డిసెంబరు 21న ఢిల్లీ వెళ్లి అదే నెల 26న తిరిగి వచ్చింది. ఆమె వచ్చినప్పటి నుంచి మల్లిక్ కనిపించకుండా పోయాడు. అయితే తన ఇంట్లోని 75 తులాల బంగారు, వజ్రాభరణాలతో పాటు రూ.6.50 లక్షల నగదు చోరీ అయినట్లు ఆలస్యంగా సుజాత గుర్తించి, కొల్లూరు పోలీసులకు ఈ నెల 9న ఫిర్యాదు చేసింది. సుజాత ఊరికి వెళ్లిన తర్వాత ప్రభాకర్ మల్లిక్ తనకు పరిచయం ఉన్న ముగ్గురితో కలిసి పథకం ప్రకారం ఇంట్లోని డబ్బులు, నగలు దాచే లాకర్‌ను బద్దలు కొట్టి ఆభరణాలు, నగదుతో ఉడాయించాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. చోరీ అనంతరం తనకు సహకరించిన వారికి కొంత నగదు ఇచ్చిన మల్లిక్ వారిని స్వగ్రామానికి పంపించాడు. మిగతా డబ్బులను తీసుకొని తాను ఇది వరకు పనిచేసిన కడప జిల్లా నంద్యాలకు వెళ్లాడు. దొగిలించిన బంగారు ఆభరణాలను విక్రయించేందుకు గోపనపల్లికి వచ్చినట్లు కొల్లూరు సమాచారం అందడంతో వారు ప్రభాకర్ మల్లిక్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. మల్లిక్‌తో పాటు సహకరించిన ఒడిస్సాకు చెందిన తపన్ దాస్(32), సచింద్ర దాస్(48), రతికంటా దాస్(26)లను అదుపులోకి తీసుకున్నారు.

## కారు, లారీ ఢీకొని బ్యాంకు ఉద్యోగి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

జహీరాబాద్, జనవరి 17: కారు, లారీ ఢీకొని విజయవాడకు చెందిన బ్యాంకు ఉద్యోగి మృతిచెందాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయవాడకు చెందిన అమర్‌దీప్ కర్ణాటకలోని చించోళీలో ఎస్‌బీఐ బ్రాంచీ ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల సంక్రాంతి పండుగకు ఇంటికి వెళ్లిన అమర్‌దీప్ బుధవారం ఉదయం మొగుడంపల్లి మండలం గౌసాబాద్ మీదుగా చించోలికి కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ కారు ఢీకొట్టడంతో అమర్‌దీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడి రిమాండ్




నిందితుడు క్రిష్ణను అరెస్టు చేసిన పోలీసులు

జహీరాబాద్, జనవరి 17: హత్యాయత్నం కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ రాజు, రూరల్ ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. హోతి(బి) గ్రామానికి చెందిన సిరిసిగ క్రిష్ణ అన్న కూతురును అదే గ్రామానికి చెందిన బోయిని శ్రీకాంత్ ఈ నెల 12న తనవెంట తీసుకెళ్లాడు. ఈ మేరకు జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఈ నెల 13న బోయిని శ్రీకాంత్ ఇంటివద్ద అతని తల్లి బోయిని పార్వతితో సిరిసిగ క్రిష్ణ తన అన్న కూతురు గురించి అడుగుతుండగా.. పార్వతి కూతురు అనురాధ, ఆమె భర్త వెంకట్ వచ్చి మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో వారిపై క్రిష్ణ తనవెంట తీసుకెళ్లిన పెట్రోల్‌ను చల్లి నిప్పుపెట్టే ప్రయత్నం చేశాడు. అనురాధ, వెంకట్ గట్టిగా అరవడంతో స్థానికులు రావడాన్ని చూసి సిరిసిగ క్రిష్ణ కత్తిని, ద్విచక్రవాహనాన్ని క్కడే వదిలేసి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సిరిసిగ క్రిష్ణపై కేసు నమోదు చేసి, బుధవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరుచగా 14రోజుల రిమాండ్ విధించారని తెలిపారు.

### డ్రంకెన్ డ్రైవ్‌కు జైలు

హవేళిఘణపూర్, జనవరి 17: మండలంలోని స్కూల్ తండాకు చెందిన వ్యక్తి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. స్పెషల్ మొబైల్ కోర్టులో పోలీసులు హాజరుపర్చగా న్యాయాధికారి మూర్తి కల్పన ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించారని ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

### విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నర్సాపూర్, జనవరి 17: హైదరాబాద్‌లోని ఎల్లమ్మగూడలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ విశ్వబ్రహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. విశ్వబ్రహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు భిక్షపతిచారి, కృపాచారి, భాస్కర్‌చారి, నరేందర్‌చారి మాట్లాడుతూ.. తెలంగాణ కోసం జీవితాంతం ఆరాటపడిన గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేయడం విచారకరమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

### గుండెపోటుతో పంచాయతీ కార్మికుడి మృతి

వెల్దుర్తి, జనవరి 17: గుండెపోటుతో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. మన్నెవారి జలాల్‌పూర్‌లో మాసాని కుమార్(30) గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం పనులు ముగించుకొని ఇంటికి వెళ్లిన కుమార్‌కు ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయి మృతిచెందాడు. మృతుడికి భార్య శారద, కుమారుడు, కూతురు ఉన్నారు.

### అయ్యప్ప ఇరుముడులకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

జోగిపేట, జనవరి 17: మున్సిపల్ పరిధిలో కొలువైన అయ్యప్ప స్వామి ఆలయాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సందర్శించారు. ఆలయంలో నిర్వహించిన అయ్యప్ప దీక్షాదారుల ఇరుముడి మహోత్సవానికి హాజరైన ఆయన అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇరుముడి కట్టుకున్న స్వాముల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి ఉన్నారు.

### స్వాముల వారి పుణ్యతిథి

నారాయణఖేడ్, జనవరి 17: లింగాపూర్‌లో శ్రీకృష్ణదేశిక స్వాముల వారి 94వ పుణ్యతిథి సందర్భంగా బుధవారం ఆరాధన, ధ్వజారోహణ, అభిషేకం, ప్రవచనాలు, భజన, నారాయణదాస్ హరికథ కాలక్షేపం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

**● తహసీల్దార్ గంగాభవానీ**



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

గుమ్మడిదల, జనవరి 17: లావణి పట్టా భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని గుమ్మడిదల తహసీల్దార్ గంగాభవానీ హెచ్చరించారు. గుమ్మడిదల మండలం అన్నారం 261 సర్వే నంబరులోని లావణి పట్టా భూముల్లో కొందరు అక్రమ నిర్మాణాలు జరిపినట్లు ఫిర్యాదు అందగా.. బుధవారం తహసీల్దార్ గంగాభవానీ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఆమెవెంట ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పెంపు

**● ఈ నెల 20 వరకు అవకాశం: ఆర్సీవో భీమయ్య**

జోగిపేట, జనవరి 17: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతిలో ప్రవేశానికి గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్లు ప్రాంతీయ గురుకులాల సమన్వయకర్త (ఆర్సీఈవో) భీమయ్య పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్ రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 180042545678 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని భీమయ్య సూచించారు.

### ఇంటర్ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గురుకుల కళాశాలల్లో ఇంటర్ చదవడానికి అర్హులైన విద్యార్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీవో భీమయ్య తెలిపారు. 2024లో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయబోయే విద్యార్థులు అర్హులన్నారు. 31 ఆగస్టు 2024 నాటికి 17 సంవత్సరాలు మించకుండా, తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలుగా ఉన్నవారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 4న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఈ నెల 25 నుంచి వచ్చే నెల 3 వరకు హాల్‌టికెట్లను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు సమీపంలోని గురుకుల కళాశాలల్లో సంప్రదించాలని ఆర్సీవో భీమయ్య పేర్కొన్నారు.

## నేటి నుంచి మైత్రీ 34వ టోర్నమెంట్

పటాన్‌చెరు, జనవరి 17: పటాన్‌చెరు పట్టణంలోని మినీ స్టేడియంలో గురువారం నుంచి ప్రారంభమవుతున్న రాష్ట్ర స్థాయి మైత్రీ 34వ క్రికెట్ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ తెలిపారు. బుధవారం ఏర్పాట్లను మైత్రీ క్రికెట్ క్లబ్ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. మైత్రీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎందరో రంజీ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దారన్నారు. టోర్నమెంట్‌కు కావాల్సిన అన్ని ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ తరఫున పూర్తి చేశామన్నారు. క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ గిరి మాట్లాడుతూ.. ఈ నెల 18నుంచి 26వరకు 34వ టోర్నమెంట్ కొనసాగుతుందన్నారు. విజేతలకు రూ.రెండున్నర లక్షల నగదు బహుమతులతో పాటు ట్రోఫీని ఎస్‌ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్లు అందజేస్తున్నట్లు తెలిపారు.

## అక్రమంగా పట్టాను మార్చేశారు

**● కోడలిపై వృద్ధురాలి ఫిర్యాదు**

చేర్యాల, జనవరి 17: చేర్యాల రెవెన్యూ అధికారులు లంచం తీసుకుని తనకు చెందాల్సిన భూమిని కోడలు పేరిట అక్రమంగా పౌతీ పట్టా మార్పిడి చేశారంటూ ఓ వృద్ధురాలు ఆరోపించింది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన కొల్ల మీనాక్షమ్మ బుధవారం తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టింది. బాధితురాలి వివరాల ప్రకారం.. తన భర్త సిద్ధారెడ్డికి 12 ఎకరాల భూమి ఉండగా.. అతడి మరణానంతరం కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి పేరిట పట్టా చేయించింది. గతంలో చేసిన అప్పులకు తన పేరిట ఉన్న 3 ఎకరాల భూమిని విక్రయించి అప్పులు తీర్చానని, కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి కూడా చనిపోయిన అనంతరం కోడలు తార తనకు తెలియజేయకుండా ముందస్తుగా 9ఎకరాల భూమిని విక్రయించిందన్నారు. తనను పోషించకుండా వ్యవహరిస్తున్న విషయమై గ్రామ పెద్దలను ఆశ్రయించడంతో మిగతా మూడెకరాల భూమిని తన పేరిట కొనసాగించాలని తీర్మానించారని తెలిపింది. కానీ రెవెన్యూ అధికారులకు లంచం ముట్టచెప్పి మూడెకరాల భూమిని తన పేరిట అక్రమంగా పౌతీ మార్పిడికి దరఖాస్తు చేసుకున్న విషయం తెలియడంతో నిలిపివేయాలని తాను అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా బుధవారం కోడలు పేరిట పట్టా మార్పిడి చేశారన్నారు. ఈ విషయమై న్యాయం చేయాలని కోడలు తారపై చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం

**● మండల సభలో అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి**




కంగ్టి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కంగ్టి, జనవరి 17: ప్రభుత్వ పథకాల అమలుతో పాటు గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యహరిస్తే ఉపేక్షించబోమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఎంపీపీ సంగీతా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముకుంద్ తండాలో మొదటి పల్లె ప్రగతిలో వేసిన విద్యుత్ స్తంభాలకు నేటికి తీగలు అమర్చలేదని సర్పంచ్ సురేఖ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి జోక్యం చేసుకొని ఏఈ గైర్హాజరుపట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏఈకి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. విద్యాశాఖలో కొనసాగుతున్న డిప్యూటేషన్లను రద్దు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇన్సూరెన్సుపై రైతులకు అవగాహన కల్పించి నష్టపోయే పంటలకు పరిహారం అందేలా కృషి చేయాలని వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారికి సూచించారు. విద్య, వైద్యం, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ అంశాలపై సభల్లో చర్చ సాగింది. అనంతరం మండలంలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. సమావేశంలో జడ్పీటీసీ లలిత, వైస్ ఎంపీపీ రేఖ, తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీవో ముజాఫరోద్దిన్, పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: నారాయణఖేడ్ శివార్లలోని కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన 213 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను, 20 మందికి షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ దేవిదాస్, పండరినాథ్‌పటేల్, నాయకులు అంజిరెడ్డి, లింగారెడ్డి, దిగంబర్‌రెడ్డి, న్యాయవాది సంగన్న, గుండేరావు, రాంసింగ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆదేశాలతో అందోలు చెరువు నుంచి నీటి విడుదల





నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

జోగిపేట, జనవరి 17: మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు అందోలు-జోగిపేట పెద్ద చెరువు (రంగనాయకసాగర్) నుంచి బుధవారం కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్లు సాగు నీటిని విడుదల చేశారు. చెరువు ఆయకట్టు కింద ఉన్న పంట పొలాల్లో వరినాట్లు ప్రారంభమైన నేపథ్యంలో నారుమళ్ల కోసం నీటిని విడుదల చేయాలని మంత్రి దామోదర్ ఇచ్చిన ఆదేశాల మేరకు.. నీటిని విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు పట్లోళ్ల ప్రవీణ్, హరిక్రిష్ణాగౌడ్, రంగ సురేశ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

వట్‌పల్లి/నిజాంపేట, జనవరి 17: వట్‌పల్లి మండల పరిధిలోని దుద్దాల, మేడుకుంద గ్రామాల్లో బుధవారం అయోధ్య శ్రీరాముని అక్షంతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పురవీధుల గుండా తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివ, శేఖర్, శివమూర్తి, రాజు, విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని కే వెంకటాపూర్ గ్రామంలో సర్పంచ్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి గర్భాలయ ప్రారంభోత్సవం సందర్భంగా దేశమంతటా అక్షింతలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సోమన్న, కిష్టయ్య, నందు, రాజేందర్, సాయిలు, రాజలింగం గౌడ్, స్వామి, బన్ని, అశోక్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.





వట్‌పల్లి మండలం దుద్దాల, నిజాంపేట మండలం కే వెంకటాపూర్‌లో అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

## రామలింగేశ్వరస్వామి రథోత్సవం



ఇస్లాంపూర్‌లో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

తూప్రాన్, జనవరి 17: తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ రామప్పగుట్టపై వెలసిన స్వయంభు భవానీ రామలింగేశ్వర స్వామి జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఆలయం వద్ద ఉదయం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద హోమం నిర్వహించారు. జడ్పీటీసీ బస్వన్నగారి రాణిసత్యనారాయణగౌడ్, సర్పంచ్ జంగం సుకన్యరమేష్, ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి సురేందర్‌రెడ్డి దంపతులు హోమంలో పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేజీకేఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

సంగారెడ్డి రూరల్, జనవరి 17: కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. ఎక్సైజ్ కార్యాలయంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్, సూపరింటెండెంట్ గాయత్రి ఆవిష్కరించారు.



సంగారెడ్డిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

## నాపై తప్పుడు ప్రచారం తగదు

**● సదాశివపేట మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం**

సదాశివపేట, జనవరి 17: తనపై కొందరు కౌన్సిలర్లు తప్పుడు ప్రచారం చేయడం తగదని సదాశిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, 13వ వార్డు కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. చైర్‌పర్సన్‌గా తన తల్లి జయమ్మ నాలుగేళ్ల పదవీ కాలంలో పట్టణంలో 26వార్డుల అభివృద్ధికి పాటుపడిందన్నారు. నిధుల పంపకంలో, ప్రొటోకాల్ పాటించడంలో పార్టీల కతీతంగా ప్రాధాన్యమిచ్చారన్నారు. కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసులను ఆసరగా చేసుకుని, పార్టీలోకి కొత్తగా వచ్చిన నాయకులకు అమ్ముడు పోయి తనపై దుష్ప్రచారం చేస్తున్నట్టు పిల్లోడి విశ్వనాథం ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ కౌన్సిలర్లే బద్నాం చేయడం ఆవేదన కలిగిస్తుందన్నారు.

## ‘100’కు తప్పుడు సమాచారమిచ్చిన వ్యక్తి అరెస్టు

జోగిపేట, జనవరి 17: డయల్ 100 నంబరుకు తాగిన మైకంలో తప్పుడు సమాచారమిచ్చిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని సంగుపేటకు చెందిన గొల్ల సుధాకర్ పలుసార్లు 100 నంబరుకు కాల్ చేసి తప్పుడు సమాచారం ఇచ్చాడు. సుధాకర్‌పై పోలీసులు దర్యాప్తు చేపట్టగా మద్యం మత్తులో ఇప్పటి వరకు ఐదు సార్లు 100 నంబరుకు డయల్ చేసి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలింది. దీంతో సుధాకర్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ వెల్లడించారు.

## 19న చేగుంటలో బాలబాలికలకు రగ్బీ పోటీలు

చేగుంట, జనవరి 17: ఈ నెల 19న చేగుంట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో మెదక్ జిల్లా స్థాయి అండర్-14 బాలబాలికల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు కోచ్ కరణం గణేష్ రవికుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 19న ఉదయం 9 గంటలకు ఆదర్శ పాఠశాల పీడీ వెంకటేశ్ వద్ద పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారులు 2010 నుంచి 2012 మధ్య జన్మించి ఉండాలని, పాల్గొనే వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బోనాఫైడ్ తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

## నిధులు స్వాహా చేసిన సర్పంచ్ తనయుడిపై కేసు

నారాయణఖేడ్, జనవరి 17: వాటర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన నిధులను ఫోర్జరీ సంతకాలతో డ్రా చేసిన సర్పంచ్ తనయుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి బుధవారం తెలిపారు. నారాయణఖేడ్ మండలం చాప్టాకె గ్రామ పంచాయతీ సర్పంచ్ పారశెట్టి సంగమ్మ కుమారుడు పారశెట్టి విజయ్‌కుమార్.. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలి సంతకాలను ఫోర్జరీ చేసి గత నెల 26 నుంచి ఈ నెల 3వరకు నాలుగు విడతలుగా రూ.6,07,500లను నారాయణఖేడ్‌లోని యూనియన్ బ్యాంకు నుంచి డ్రా చేశాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## తపాస్‌పల్లి నీటిని విడుదల చేయాలి

కొండపాక, జనవరి 17: కొండపాక మండల రైతుల పంట పొలాలకు తపాస్‌పల్లి డి-4 కెనాల్ కాలువ నీటిని అందించేలా ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి పేర్కొన్నారు. తపాస్‌పల్లి నుంచి కొండపాక మండలానికి వచ్చే డి-4 కాలువను బుధవారం ఆయన స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యాసంగి పంట చేతికి రావాలంటే పూడుకుపోయి కాల్వల ద్వారా చెరువులలోకి సాగునీరు అందకపోతే పంటలు పండని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతులను ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.